టీ-మీడియా

Digital, tmedia.net.in

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

11వ వార్షికోత్సవం 2016 - 2026

మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం 22/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ



ప్రజలను వేధిస్తున్న వారి తాట తీయాలి

సీఎం చంద్రబాబు

టీ మీడియా, అక్టోబర్ 21, మంగళగిరి : దేశ రక్షణకు భంగం కలిగే చర్యలను ఏపీ పోలీసు వ్యవస్థ అడ్డుకుందని సీఎం చంద్రబాబు అన్నారు. భద్రతపై నమ్మకం ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని చెప్పారు. రాజకీయ ముసుగులో నేరాలను సహించవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ నేరస్థులకు రక్షణ కల్పించకూడదన్నారు. రప్పా రప్పా అంటూ ప్రజలను వేధిస్తున్నవారి తాట తీయాలన్నారు. సోషల్ మీడియా సైకోలను కూడా వదిలిపెట్టవద్దన్నారు. మంగళగిరిలోని ఆరో బెటాలియన్ పరేడ్ గ్రౌండ్స్‌లో బుధవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. అలజడి, అశాంతి, అభద్రత ఉన్న ప్రాంతాలకు పెట్టుబడులు రావని, నేను ఎప్పుడు అధికారంలో ఉన్నా శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యత ఇస్తానని తేల్చి చెప్పారు. భద్రతపై నమ్మకం ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు సాధ్యమవుతాయన్నారు. వెల్త్, హెల్త్, హ్యాపీ సొసైటీ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



బాధితులకు భరోసా ఇవ్వాలి

ఏపీ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందని, క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడంలో మంచి ట్రాక్ రికార్డు ఉందని చంద్రబాబు అన్నారు. తీవ్రవాదం, రౌడీయిజాన్ని అణచివేయడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. నేరాలకు పాల్పడే వారికి రాజకీయ అండ ఉండకూడదని స్పష్టం చేశారు. మహిళల భద్రత సమాజ నాగరికతకు కొలమానమని పేర్కొన్నారు. ఒక వ్యక్తి చెడు అలవాట్లు అతడి కుటుంబంతో పాటు సమాజంపైనా ప్రభావం చూపుతాయని చెప్పారు.పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ తమ సమస్యకు పరిష్కారం ఆశించి వస్తారని సీఎం తెలిపారు. కొందరు భయంతో, మరికొందరు కన్నీళ్లతో వస్తారని, అలాంటి బాధితులకు పోలీసు యూనిఫాం భరోసా కల్పించాలని సూచించారు. పోలీసుల పనితీరు శాఖ ప్రతిష్ఠను పెంచేలా ఉండాలన్నారు. నేరాలు చేసే విధానం మారుతున్నందున దర్యాప్తు పద్ధతులూ అందుకు అనుగుణంగా మారాలని సీఎం సూచించారు.సాంకేతికతలో అగ్రస్థానంలో ఉండాలి: ఏపీ పోలీసులంటే టెక్నాలజీలో టాప్ అని దేశమంతా అనుకోవాలని చంద్రబాబు అన్నారు. ప్రమాదం జరిగినా, నేరం చోటు చేసుకున్నా ముందుగా గుర్తుకొచ్చేది పోలీసులేనని చెప్పారు. ఎండ, వాన, పండుగలు, రాత్రి, పగలు అనే తేడా లేకుండా ప్రజలకు సేవలందించే విభాగం పోలీసు శాఖ అని కొనియాడారు. శరన్నవరాత్రులు, విజయవాడలో జరిగే ఉత్సవాల నిర్వహణలోనూ పోలీసులు కీలకంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, సీఎస్ సాయిప్రసాద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లకు 25 శాతం సీట్లు

- అమలు చేసేందుకు అడుగులు

టి మీడియా, అక్టోబర్ 21, హైదరాబాద్ బ్యూరో : సమాజంలోని ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లల కోసం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించే విషయంలో పురోగతి కనిపిస్తోంది. దశాబ్దాలు గడిచినా అనేక రాష్ట్రాలు ఈ నిబంధనను అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు ఇటీవల 'జాతీయ బాలల హక్కుల పరిరక్షణ సంఘం' (ఎన్?సీపీసీఆర్?)పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 27న జరగనున్న విచారణకు స్వయంగా హాజరై అమలు తీరుపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఎన్?సీపీసీఆర్?ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్?సీపీసీఆర్? రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరగా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ దిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను రాష్ట్రం అమలు చేస్తుందని కమిషన్‌కు హామీ ఇచ్చారు.

వివిధ రాష్ట్రాల్లో అమలు

విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లోని ఒకటో తరగతిలో 25 శాతం సీట్లను వెనుకబడిన వర్గాల విద్యార్థుల కోసం కేటాయించాలి. వారికి ఉచిత విద్యను అందించాలి. ఈ నిబంధన అమలుకు సంబంధించి ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రవేశాల కోసం ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించడం, ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించడం, లాటరీ పద్ధతి ద్వారా సీట్లను కేటాయించడం, సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడం వంటి చర్యలను కోర్టు తప్పనిసరి చేసింది. దీని అమలు పర్యవేక్షణ బాధ్యతను ఎన్?సీపీసీఆర్?కి అప్పగించింది. మహారాష్ట్ర, హర్యానా, ఉత్తర్?ప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఇప్పటికే అవసరమైన విధివిధానాలను రూపొందించి ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి.

గత ఏడాది నామమాత్రంగా

తెలంగాణలో ఈ చట్టం అమలుకు సంబంధించి గత ఏడాది హైకోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. దీంతో అప్రమత్తమైన విద్యాశాఖ ఈ చట్టాన్ని అమలు చేస్తామని అంగీకరించింది. 2025 జులైలో ప్రభుత్వ పాఠశాలలు లేని 96 ప్రాంతాలకు చెందిన పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేలా, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు కేవలం ఉత్తర్వులు ఇచ్చి ఊరుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీని ఫలితంగా 2025-26, 2026-27 విద్యా సంవత్సరాల్లో కలిపి కేవలం 180 మంది పిల్లలు మాత్రమే ప్రవేశాలు పొందారని విద్యాశాఖ వర్గాల సమాచారం. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడంతో అధికారులు దీనిపై మరోసారి దృష్టి సారించారు.



సీజేపీ నేతలకు ఊరట

సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా విడుదలకు ఆదేశం

టీ మీడియా, అక్టోబర్ 21, ఢిల్లీ బ్యూరో : కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకాకు ఊరట లభించింది. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 13న జరిగిన నిరసనకు సంబంధించిన కేసులో వారిని విడుదల చేయాలని ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు బుధవారం ఆదేశించింది. ఇరువురి జ్యుడీషియల్ కస్టడీ గడువు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. వారి కస్టడీ గడువు ముగియడంతో ముందుగా సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాను పోలీసులు ఇవాళ ఎస్ఈఎం ఎదుట హాజరుపరిచారు. విచారణ ప్రక్రియలో భాగంగా పూచీకత్తులను కూడా సమర్పించారు. అనంతరం వారిని విడుదల చేయాలని మేజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారు.జంతర్ మంతర్ వద్ద అక్టోబర్ 13న జరిగిన నిరసనల సందర్భంగా ఇరువురిని దిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిషేధిత ప్రాంతం లేదా నిరసనలకు అనుమతి లేని ప్రదేశంలోకి ప్రవేశించారని, శాంతిభద్రతలను కాపాడతామని ఇచ్చిన పీస్ బాండ్ నిబంధనల్ని ఉల్లంఘించారన్న ఆరోపణలతో ఈ చర్యలు తీసుకున్నారు. అనంతరం వారిని అక్టోబర్ 14న మేజిస్ట్రేట్ 5 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించారు. అక్టోబర్ 19న గడువు ముగియడంతో కస్టడీని మరో రెండు రోజులు పొడిగించారు. ఈ గడువు బుధవారం ముగియడంతో విడుదల ఆదేశాలు వచ్చాయి. ప్పిలేట్ కోర్టును ఆశ్రయించవచ్చని స్పష్టం చేసింది.

దిల్లీ హైకోర్టుకు సీజేపీ నేతలు

ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం ఈ కేసులో సౌరవ్ దాస్, అశుతోష్ రాంకా జ్యుడీషియల్ కస్టడీ విషయంలో జోక్యం చేసుకోవడానికి దిల్లీ హైకోర్టు నిరాకరించింది. ముందుగా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు నిర్ణయం కోసం వేచి చూడాలని సూచించింది. ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించకుండా నేరుగా హైకోర్టుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించింది. మేజిస్ట్రేట్ నిర్ణయం తర్వాత కూడా వారికి ఏమైనా అభ్యంతరాలు లేదా ఫిర్యాదులు ఏమైనా ఉంటే, సంబంధిత అప్పీలేట్ కోర్టును ఆశ్రయించొచ్చని హైకోర్టు పేర్కొంది.విచారణ సందర్భంగా దిల్లీ హైకోర్టు ఫ్రాన్స్‌లో జరుగుతున్న ఆందోళనలను కూడా ఉదాహరణగా ప్రస్తావించింది. పోలీసుల అనుమతి తీసుకోకుండా చేసే నిరసనల్ని ఏ మాత్రం సహించబోమని స్పష్టం చేసింది. విద్యార్థుల ముసుగులో ఇక్కడ దేశ

➤ మిగతా 2వ పేజీలో..

దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు



➤ 2వ పేజీలో..

పోలీసుశాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి

అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత

టి మీడియా, అక్టోబర్ 21, హైదరాబాద్ బ్యూరో : పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాంతిభద్రతలు బాగుంటేనే రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా ఉంటుందన్నారు. సమాజం కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని సీఎం తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా గోషామహల్?లో నిర్వహించిన పోలీసు స్మారక పరేడ్? కార్యక్రమానికి హాజరైన రేవంత్ రెడ్డి, అమరవీరులను నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఏడాది ఏడాది 155 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం బాధకరమని అన్నారు. కొత్త సవాళ్లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పోలీస్?శాఖ మార్పులు చేసుకుంటోందని సీఎం కొనియాడారు.

2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలు భర్తీచేస్తాం

పోలీసుశాఖను బలోపేతం చేసేందుకు ఈ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 4,773 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్న ఆయన



పోలీసుశాఖలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చామని వెల్లడించారు. మిగతా ఖాళీలను కూడా విడతల వారీగా భర్తీ చేస్తామని చెప్పారు. 2028 నాటికి పోలీసుశాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 112 మంది డీఎస్పీలను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ చేశామని తెలిపారు. పోలీసుశాఖలో ఎక్స్‌గ్రేషియాను హోదా ఆధారంగా రూ.కోటికి పైగా పెంచామని అన్నారు. దేశానికి సేవ చేసిన వారిని గుర్తించటంతో పాటు వారి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పోలీసు ఉద్యోగుల పిల్లల కోసం ప్రత్యేకంగా అంతర్జాతీయ స్థాయిలో పోలీసు స్కూల్‌ను ఏర్పాటు చేశామని ఆయన పునరుద్ఘాటించారు.

డ్రగ్స్? కట్టడిలో పోలీస్‌శాఖ పనితీరు బాగుంది

యువత జీవితాలు మత్తు బారిన పడటం బాధకరమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. యువకులు మత్తుకు బానిసలు కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. డ్రగ్స్? కట్టడిలో రాష్ట్ర పోలీసుశాఖ పనితీరు బాగుందని ఆయన కొనియాడారు. ఉత్తమ పనితీరులో

➤ మిగతా 2వ పేజీలో..

పోలీసుశాఖలో 7,437 పోస్టుల భర్తీకి అనుమతి

రాష్ట్ర పోలీసుశాఖ జాతీయ స్థాయిలో తొలి స్థానం దక్కించుకుందన్నారు. ఆహార కల్తీ కట్టడికి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుందన్న ఆయన టీజీ సేఫ్ ద్వారా ఆహార కల్తీపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ట్రాన్స్‌జెండర్లకు ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలు అప్పగించి.. సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే.. క్రిమినల్స్‌తో ఫ్రెండ్లీగా ఉండమని కాదని, బాధితులు, సామాన్యులు, అమాయకుల పట్ల మాత్రమే ఫ్రెండ్లీ పోలీసింగ్ చేయాలన్నారు. క్రిమినల్స్, కబ్జాదారులు, డ్రగ్స్ దందా చేసేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అమరవీరుల త్యాగాలను గౌరవిద్దాం, వారి ఆశయాలు కొనసాగిద్దామన్నారు. సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామన్నారు.

సీజేపీ నేతలకు ఊరట

వ్యతిరేక శక్తులు అల్లర్లు సృష్టించే అవకాశం ఉందని వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగానే ఫ్రాన్స్‌లో నిరసనలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నాం కదా? ఆ దేశం అగ్నిగుండంలా మారడం, దోపిడీలు జరుగుతుండటం చూస్తున్నాం కదా అని పేర్కొంది. అందుకే కచ్చితంగా పోలీసుల అనుమతి తీసుకోవాల్సిందేనని స్పష్టం చేసింది. ఇంకా నిరసన ప్రదేశాల జాబితా నుంచి జంతర్ మంతర్‌ను తొలగించిన తర్వాత కూడా అక్కడికి ఎందుకు వెళ్లారని పిటిషనర్లకు చీవాట్లు పెట్టింది.

దిల్లీలో మళ్లీ వాయు కాలుష్యం

అమల్లోకి వచ్చిన గ్రాఫ్ స్టేజ్1 ఆంక్షలు

టీ మీడియా, అక్టోబర్ 21, ఢిల్లీ బ్యూరో : దేశ రాజధాని దిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లో వాయు కాలుష్యం మరోసారి ఆందోళన కలిగిస్తోంది. గాలి నాణ్యత సూచీ దిగజారడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కాలుష్య నియంత్రణ చర్యలను వేగవంతం చేసేందుకు దిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ) స్టేజ్-1ను తక్షణమే అమలు చేస్తున్నట్లు వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) బుధవారం ప్రకటించింది. రానున్న రోజుల్లోనూ గాలి నాణ్యత ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.

ఒక్కరోజులోనే పెరిగిన కాలుష్యం

దిల్లీలో అక్టోబర్ 20న వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 179గా నమోదైంది. ఇది 'మోస్తరు' కేటగిరీ పరిధిలోకి వస్తుంది. అయితే అక్టోబర్ 21న మధ్యాహ్నం 2 గంటలకు ఈ సూచీ 244కు చేరింది. దీంతో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలోకి వెళ్లింది. ఒక్కరోజు వ్యవధిలోనే కాలుష్య స్థాయిలు గణనీయంగా పెరగడం అధికారులను అప్రమత్తం చేసింది. భారత వాతావరణ విభాగం (ఐఎండీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) అంచనాల ప్రకారం, రానున్న రోజుల్లోనూ దిల్లీలో గాలి నాణ్యత 'పూర్' కేటగిరీలో కొనసాగే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిని సమీక్షించిన, భారత వాతావరణ శాఖ, ఇతర సంస్థలు కాలుష్యాన్ని మరింత పెరగకుండా నిరోధించేందుకు తొలి దశ చర్యలను అమలు చేయాలని నిర్ణయించింది.

జీఆర్ఏపీ స్టేజ్-1 ఎందుకు?

వాయు కాలుష్యం పెరుగుతున్నప్పుడు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి దశలవారీగా చర్యలు చేపట్టే విధానమే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్. గాలి నాణ్యత ఆధారంగా వివిధ దశల్లో నియంత్రణ చర్యలను అమలు చేస్తారు. ప్రస్తుతం దిల్లీలో ఏక్యూఐ 244కు చేరడంతో తొలి దశను అమల్లోకి తీసుకొచ్చారు. ఈ నిర్ణయం దిల్లీకి మాత్రమే పరిమితం కాకుండా మొత్తం జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్) పరిధిలో వర్తిస్తుందని సీఏక్యూఎం స్పష్టం చేసింది. సంబంధిత ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, అమలు చేసే ఇతర విభాగాలు తమ పరిధిలోని చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించింది. ఇప్పటికే అమల్లో ఉన్న కాలుష్య నియంత్రణ మార్గదర్శకాలను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని సూచించింది. గాలి నాణ్యత మరింత దిగజారకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపింది. పౌరులు కూడా జీఆర్ఏపీ స్టేజ్-1లో సూచించిన మార్గదర్శకాలను పాటించాలని కోరింది.

స్కూటీని తప్పించబోయి చెట్టును ఢీకొట్టిన కారు



టీ మీడియా ।,అక్టోబర్ 21, పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా పరిధిలో పెను ప్రమాదం తప్పింది. పెద్దపల్లి మండలం రాంపల్లి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జమ్మికుంట నుంచి పెద్దపల్లి వైపు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి రాంపల్లి శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తప్పినప్పటికీ ఆరుగురికి గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు, ఓ చిన్నారికి గాయాలయ్యాయి.స్థానికుల సమాచారంతో వారిని వెంటనే 108 ద్వారా పెద్దపల్లి దవాఖానకు తరలించారు. కుటుంబసభ్యులంతా జమ్మికుంటలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరై ూ 22 జ 7888 నంబర్ గల కారులో తిరిగి వస్తున్న క్రమంలో ఆ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది.

కోట మైసమ్మ జాతరలో సౌకర్యాలు గాలికి

- పారిశుద్ధ్యం పడకేసింది.. పరిసరాల్లో దుర్వాసన!
- వసూళ్లపై ఆరోపణలు.. భక్తుల సౌకర్యాలపై నిర్లక్ష్యమా?



టీ మీడియా ।,అక్టోబర్ 21, సింగరేణి (కారేపల్లి): ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కోట మైసమ్మ అమ్మవారి జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. అయితే జాతరలో భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాల నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పారిశుద్ధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, మురుగునీటి పారుదల వంటి మౌలిక వసతుల కల్పనలో దేవాదాయ శాఖ అధికారులు తగిన శ్రద్ధ చూపడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

వసూళ్లు జోరు.. సౌకర్యాలు బేజారు!

జాతరకు వచ్చే వాహనాలకు పూజల పేరుతో నిర్ణీత రుసుము కంటే అధికంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సామాన్య భక్తుల నుంచి రుసుముల వసూళ్లపై చూపుతున్న శ్రద్ధను కనీస సౌకర్యాల కల్పనలోనూ చూపాలని భక్తులు కోరుతున్నారు. వాహన పూజలకు అధికారికంగా నిర్ణయించిన రుసుము ఎంత? ప్రస్తుతం ఎంత వసూలు చేస్తున్నారు? అధిక వసూళ్ల ఆరోపణల్లో వాస్తవమెంత? అనే అంశాలపై దేవాదాయ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

పారిశుద్ధ్యం ఎక్కడ.. పరిశుభ్రతకు దిక్కేది?

భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే జాతరలో పారిశుధ్య నిర్వహణ అత్యంత కీలకం. అయితే జాతర పరిసరాల్లో పరిశుభ్రత లోపిస్తోందని, చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించడం లేదని భక్తులు వాపోతున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక పారిశుధ్య బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం శుభ్రత చర్యలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇంకుడు గుంతలేవి.. మురుగునీరు వెళ్లేదెక్కడ?

మురుగునీటి నిర్వహణకు తగిన ఏర్పాట్లు లేకపోవడంతో జాతర పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరుగుదొడ్ల వినియోగం పెరిగే సమయంలో మురుగునీటి పారుదలకు ముందస్తు ఏర్పాట్లు చేయకపోతే దుర్వాసనతోపాటు పారిశుధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలు బహిరంగ మరుగుదొడ్లను తలపిస్తున్నాయని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ ఏది?

జాతర ప్రారంభానికి ముందే భక్తుల రాకపోకలను అంచనా వేసి తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, మురుగునీటి పారుదల వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సి ఉంటుంది. ఏర్పాట్లు చేశామని చెప్పడం మాత్రమే కాకుండా, అవి సక్రమంగా అమలవుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

అయితే జాతర పరిసరాల్లో సమస్యలు ఉన్నాయంటూ భక్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని వెంటనే పరిష్కరించే పర్యవేక్షణ వ్యవస్థ ఏమైందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'వసూళ్లకు లెక్క ఉంది.. భక్తుల సౌకర్యాలకు లెక్క లేదా?' అనే ప్రశ్న భక్తుల నుంచి వినిపిస్తోంది. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు జాతర ప్రాంగణాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి, అధిక వసూళ్ల ఆరోపణలపై విచారణ జరపాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, మురుగునీటి నిర్వహణలోని లోపాలను యుద్ధప్రాతిపదికన సరిచేసి, జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



హత్యాయత్నం కేసులో ముగ్గురు అరెస్ట్



టీ మీడియా ।,అక్టోబర్ 21, కోరుట్ల : దసరా పండుగ సందర్భంగా కత్తితో దాడి చేసి గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డ ముగ్గురు నిందితులను కోరుట్ల పోలీసులు అరెస్ట్ (ూతీవర్) చేసి రిమాండ్‌కు తరలించారు. కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన గుద్దేటి రాజేందర్ కాలనీలో దుర్గామాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమంలో ఉండగా రామ్ నగర్ కాలనీకి చెందిన కిరణ్, అజయ్ గొడవ పడ్డారు.బుధవారం తెల్లవారుజామున మరో వ్యక్తి జ్ఞానదీప్‌తో కలసి వచ్చి రాజేందర్‌తో మరోసారి గొడవపడ్డారు. వెంట తెచ్చుకున్న కత్తితో జ్ఞానదీప్ దాడి చేయడంతో రాజేందర్ ఎడమ భుజం, మెడ ఎడమ వైపు గాయాలయ్యాయి. స్థానికులు నిందితులను పట్టుకోవడానికి ప్రయత్నించగా, వారు కత్తితో బెదిరించి అక్కడి నుంచి పారిపోయారని సీఐ తిరుపతి వెల్లడించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి ముగ్గురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఆకట్టుకున్న అకాడ ప్రదర్శనలు

- కర్ర సామును ప్రదర్శించిన సంధ్యారాణి



టీ మీడియా ।,అక్టోబర్ 21, గోదావరిఖని : సాంప్రదాయ యుద్ధ కళలలో ఒకటైనా అకాడ ప్రదర్శనలు గోదావరిఖని లో విశేషంగా ఆకట్టుకున్నాయి. మాజీ జడ్పీ సభ్యురాలు కందుల సంధ్యారాణి కర్రసాము, కత్తి సాము తదితర యుద్ధ విన్యాసాలను ప్రదర్శించి అదరగొట్టారు.విజయదశమి సందర్భంగా గోదావరిఖని విద్యానగర్ లోని జై భారత్ హనుమాన్ అకాడ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిగింది. వస్తాద్ లు మచ్చ శంకర్, జాఫర్ నేతృత్వంలో కళాకారులు, చిన్నారులు విద్యానగర్ నుంచి స్థానిక కోదండ రామాలయం వరకు దారి పొడవునా సాహస విన్యాసాలను ప్రదర్శించారు.జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రాంచందర్ ముఖ్యతిథిగా హాజరై ఈ ప్రదర్శనల ను ప్రారంభించారు. అతిథులు మాట్లాడుతూ 40 యేళ్లుగా గోదావరిఖనిలో సాంప్రదాయ యుద్ధ కళ అకాడకు పురుడు పోస్తూ ప్రతి ఏటా దసరా రోజున ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీయమన్నారు. అంతరించిపోతున్న యుద్ధ కళను రక్షిస్తున్న వస్తాద్ లను అభినందించారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, రాష్ట్ర నాయకులు కందుల సంధ్యారాణి పోషం, చిలుక. భారతి, ఆసంపల్లి వాసు, గాలిపల్లి తిరుపతి, కెప్టెన్లు కండె సమ్మయ్య, శ్రీనివాస్, మచ్చ విశ్వాస్, దామోదర్, జసగామ శ్రీనివాస్ తోపాటు కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలి

●తుంబూరు దయాకర్ రెడ్డి



టీ మీడియా, అక్టోబర్ 21, ఖమ్మం రూరల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సూచించారు.ఏదులాపురం మున్సిపాలిటీ నూతన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన గుర్రం రాకేష్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బానోత్ సాయిలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం చేశారు.యువతను పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా భాగస్వాములను చేయడంతోపాటు, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

కాంగ్రెస్ నాయకుడు కనకం మైసయ్య మృతి



టీ మీడియా, అక్టోబర్ 21, కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కనకం మైసయ్య మంగళవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఖమ్మంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.మైసయ్య మృతి వార్త తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, మిత్రులు ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఆయన మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తమకు తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మహమ్మద్ హఫీరుద్దీన్, కూసుమంచి గ్రామపంచాయతీ సర్పంచ్ కొండ కృష్ణవేణి మహిపాల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మాదాసు ఉపేందర్ రావు, కాంగ్రెస్ నాయకులు భారీ వీరభద్రం, గుండా దామోదర్ రెడ్డి, కొండ మహిపాల్, చాట్ల పరశురాం, అంతోటి వెంకన్న, బెల్లంకొండ కిరణ్, బీఆర్ఎస్ నాయకుడు నలగాటి నాగయ్య, బీజేపీ నాయకుడు గుండ ఉపేందర్ రెడ్డి, న్యూ డెమోక్రసీ నాయకుడు చెరుకుపల్లి వీరయ్య, ప్రముఖులు గోపే రవి (లచ్చయ్య), వెంకన్న, ఎంఎస్పీ నాయకుడు పులిపాటి వెంకన్న, కనకం అక్కులయ్య, గోపె సుందరయ్య, వినయ్, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

జోరందుకున్న ఎంపీటీసీ నామినేషన్ల పర్వం



టీ మీడియా ,అక్టోబర్ 21 ।,చింతూరు:పోలవరం జిల్లా చింతూరు ఏజెన్సీలో ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల పర్వం జోరందుకుంది. వీఆర్‌పురం, కూనవరం, చింతూరు, ఎటపాక మండలాల్లో ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. బుధవారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ అక్టోబర్ 23వ తేదీ వరకు కొనసాగనుంది.ఎంపీటీసీ స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు తమ అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో రాజకీయ సందడి నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ఊపందుకోవడంతో ఆయా మండలాల్లో రాజకీయ కార్యకలాపాలు వేగవంతమయ్యాయి.నామినేషన్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చింతూరు ఎస్సై ఎం. సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రంగా ఉన్న ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిఘాను పెంచడంతో పాటు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



టీ మీడియా, అక్టోబర్ 21, ఎర్రుపాలెం: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన బైక్ ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. తెల్లపాలెం గ్రామానికి చెందిన వాగదాని వీరబాబు (23) కండ్రిక నుండి ఎర్రుపాలెం వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. ఈ దుర్ఘటనలో రోడ్డుకు తల బలంగా తగలడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమేష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని మధిర ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి తండ్రి వాగదాని శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ మేనేజర్

ఆత్మహత్యపై సమగ్ర విచారణ

●టిడిఎంఎఫ్ కన్వీనర్ శనగపాటి మురళీకృష్ణ డిమాండ్

టీ మీడియా ,అక్టోబర్ 21, ఖమ్మం : నవ భారత్ హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ మేనేజర్, డిప్యూటీ తహసీల్దార్ అనంతుల లక్ష్మీనారాయణ ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరపాలని తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ కన్వీనర్ శనగపాటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.మొత్తంగా వంట గ్యాస్ అక్రమ విక్రయాలు పెరిగిపోయాయని, ఉమ్మడి జిల్లాలో హెచ్‌పీ గ్యాస్‌కు సంబంధించిన అక్రమాలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. అక్రమాలకు అడ్డుగా నిలిచినందుకే తనను వేధిస్తున్నారని లక్ష్మీనారాయణ తన చివరి లేఖలో పేర్కొనడం, అక్కడి అక్రమాల తీవ్రతకు నిదర్శనమని అన్నారు. జర్నలిస్టులుగా చెప్పుకునే కొందరిపై వేధింపులకు సంబంధించిన ఆరోపణలు రావడం బాధాకరమని పేర్కొన్నారు.ముందుగా పౌరసరఫరాల శాఖ అధికారులు స్పందించి, లక్ష్మీనారాయణ చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అదే విధంగా గ్యాస్ గోడౌన్‌లో సీసీ కెమెరాలు ఎందుకు ఏర్పాటు చేయలేదనే అంశంపై సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులుగా చలామణి అవుతున్నవారు కూడా ఈ ఘటనపై స్పందించి, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

జరిగిన ఘటనకు సంబంధించి అధికారిక వివరాలు పూర్తిస్థాయిలో వెల్లడికాకముందే సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టులు, వ్యాఖ్యలు జర్నలిస్టులందరినీ కించపరిచేలా ఉండటం బాధాకరమని మురళీకృష్ణ అన్నారు. జర్నలిజం ముసుగులో బ్రోకరేజీకి పాల్పడుతున్న కొందరి సంఖ్య ఇటీవల భారీగా పెరిగిందని ఆరోపించారు.డిజిటల్ మీడియా గైడ్‌లైన్స్--2021 ప్రకారం అవసరమైన నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతరుల మీడియా లోగోలను ఉపయోగించేవారు, అనుమతులు లేకుండా ఈ-పేపర్లు నిర్వహించేవారు, ప్రింట్ ప్రచురణకు అనుమతి పొంది పీడీఎఫ్ రూపంలో పత్రికలను నడిపేవారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి చర్యలు తీసుకున్నప్పుడే జర్నలిజం ముసుగులో అక్రమాలకు పాల్పడేవారిని అడ్డుకోవచ్చని పేర్కొన్నారు.

బాధితులు ఫిర్యాదులు చేయండి

జర్నలిజం ముసుగులో ఎవరైనా మీడియా పేరు చెప్పి వేధింపులకు పాల్పడితే, వారిపై ఢిల్లీ స్థాయిలోనూ ఫిర్యాదు చేసే అవకాశం ఉందని మురళీకృష్ణ తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు బయటకు వెల్లడికాకుండా విచారణ జరిగే విధానాల గురించి సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశాన్ని బాధితులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రతి ఆన్‌లైన్ మీడియా సంస్థ తన స్వీయ నియంత్రణ కమిటీ వివరాలు, ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నంబర్, కార్యాలయ చిరునామా తదితర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉండేలా తన వెబ్‌సైట్‌లో ప్రచురించాలని నిబంధనలు పేర్కొంటున్నాయని తెలిపారు. ఈ అంశాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

అడగడంలో నిషేధం లేదు..

భారతదేశంలో సహాయం, చందా లేదా ఆర్థిక సహకారం కోరడంపై సాధారణంగా నిషేధం లేదని మురళీకృష్ణ పేర్కొన్నారు. పత్రికల నిర్వహణ కోసం ప్రకటనలు అడగడం మాత్రమే బెదిరింపుగా పరిగణించరాదని, అయితే ప్రకటనల పేరుతో ఎవరినీ బెదిరించకూడదని స్పష్టం చేశారు.

ప్రకటనల కోసం చెల్లింపులు స్వీకరించినప్పుడు చట్టబద్ధమైన రసీదు లేదా బిల్లు ఇవ్వాలని అన్నారు. చెల్లింపు చేసిన వ్యక్తి బిల్లు వద్దని చెప్పినా, వర్తించే చట్టపరమైన నిబంధనలను పాటించడం తప్పనిసరని పేర్కొన్నారు.ఈ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని మురళీకృష్ణ అభిప్రాయపడ్డారు. ఏ సమస్యకైనా ఆత్మహత్య పరిష్కారం కాదని, సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను ఆశ్రయించి న్యాయం పొందేందుకు ప్రయత్నించాలని సూచించారు.

అమరవీరుల త్యాగాలే పోలీస్ శాఖకు స్ఫూర్తి

●నివాళులు అర్పించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



టీ మీడియా ,అక్టోబర్ 21, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అమరవీరుల స్తూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం సాయుధ పోలీసులు "శోక్ శస్త్ర" నిర్వహించి అమరవీరులకు గౌరవ వందనం సమర్పించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వీరమరణం పొందిన పోలీసులకు ఘనంగా నివాళులర్పించారు. గత ఏడాది నుంచి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల పేర్లను ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ చదివి వినిపించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలు ప్రతి పోలీస్ అధికారి, సిబ్బందికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.

. ఉగ్రవాదం, నక్సలిజం వంటి సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది సేవలు అభినందనీయమని అన్నారు.అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పి వెంకన్న బాబు, మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, భద్రాచలం డిఎస్పి అరుణ్ కుమార్, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్య నాయక్, జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.

పాలేరు రిజర్వాయర్ నుంచి చింతపల్లి చెరువుకు నీటి విడుదల



టీ మీడియా, అక్టోబర్ 21, ఖమ్మం రూరల్: సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాలతో, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబురి దయాకర్ రెడ్డి సూచన మేరకు పాలేరు రిజర్వాయర్ నుంచి చింతపల్లి చెరువుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం చింతపల్లి చెరువును పరిశీలించారు.ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో గ్రామస్తులు, రైతులకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఖమ్మం రూరల్ మండల పరిధిలోని చెరువులను నింపేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తోట వీరభద్రం తెలిపారు. చెరువుల్లో నీటి నిల్వలు పెరగడం వల్ల వ్యవసాయ అవసరాలు తీరడంతో పాటు ప్రజలకు తాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా చెరువుల్లో నీటి లభ్యత పెరగడం వల్ల సైబీరియన్ కొంగలు వంటి వలస పక్షులకు కూడా నీటి వసతి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాలు, రైతుల ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని చెరువులను నింపేందుకు చర్యలు తీసుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తోట వీరభద్రం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో చింతపల్లి మాజీ సర్పంచ్ ముత్యం చిన్న కృష్ణారావు, తోట రామకృష్ణ, గునిగంటి రమేష్, గునిగంటి సురేష్, ఇరిగేషన్ లస్కర్ బాబు, కోడె ప్రవీణ్, ఆరేంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీపై దాడి

•ఖమ్మం ఆసుపత్రికి తరలింపు



టీ మీడియా ,అక్టోబర్ 21 ।, సింగరేణి (కారేపల్లి):పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన ఓ యువ వలస కూలీపై దాడి జరిగినట్లు వచ్చిన ఆరోపణలు సింగరేణి మండలంలోని మాణిక్యారం గ్రామంలో కలకలం రేపాయి. ఈ ఘటనలో రాజు (19) అనే యువకుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యాడు. కుటుంబాన్ని పోషించుకునేందుకు సొంత ప్రాంతాన్ని విడిచి వచ్చి కూలి పని చేసుకుంటున్న యువకుడిపై దాడి జరగడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగింది

స్థానికుల కథనం ప్రకారం.. ఇతర రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వచ్చిన రాజు మాణిక్యారం ప్రాంతంలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ రైతు అతనిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే, దాడి ఎందుకు జరిగింది? ఘటనకు ముందు ఇద్దరి మధ్య ఏదైనా వివాదం చోటుచేసుకుందా? అనే విషయాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది.

దాడిలో గాయపడిన రాజును స్థానికులు వెంటనే కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం, గాయాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

అంబులెన్స్ అందుబాటులో లేక ఆటోలో తరలింపు

గాయపడిన యువకుడిని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించే సమయంలో కారేపల్లిలో అంబులెన్స్ అందుబాటులో లేక ఆటోలో తీసుకెళ్లినట్లు స్థానిక సమాచారం. అత్యవసర వైద్య సేవల సమయంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడానికి గల కారణాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. ఈ అంశంపై సంబంధిత అధికారులు వివరాలు వెల్లడిస్తే వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఫోన్‌చేసిబెదిరింపులు

• యువ న్యాయవాది ఆత్మహత్య



టి మీడియా, అక్టోబర్ 21, ముదిగొండ : పండగ వేళ ఖమ్మం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. తనను ఎవరో వెంబడిస్తూ, ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన ఓ యువ న్యాయవాది ఆత్మహత్యకు పాల్పడ్డారు. రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళ్తే వి.వెంకటాయపాలెంకు చెందిన తొలుపునూరి గణేశ్ (27) గత ఏడాది కాలంగా ఖమ్మం కోర్టులో జూనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి తన అన్న సాయితేజతో కలిసి ముదిగొండ మండలం పెద్దమండవలోని అమ్మమ్మ పద్మావతి ఇంటికి వెళ్లాడు. పండగ సందర్భంగా మంగళవారం అమ్మమ్మ పద్మావతి, సాయితేజ గుడికి వెళ్లి తిరిగి వచ్చేసరికి గణేశ్ ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. అది చూసి ఒక్కసారిగా వారు షాక్‌కు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.కాగా, గత నాలుగు రోజులుగా ఎవరో తనను వెంబడిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గణేశ్ చెప్పినట్లు అతని తండ్రి దానయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కొందరు ఫోన్లు చేసి బెదిరిస్తున్నారని కూడా గణేశ్ ఆవేదన వ్యక్తం చేసినట్లు ఆరోపించాడు. ఈ కారణంగా మనస్తాపానికి గురైన కుమారుడికి కొంత మార్పు కల్పించాలనే ఉద్దేశంతో అమ్మమ్మ ఇంటికి పంపించామని, ఇంతలోనే ఈ విషాదం చోటుచేసుకుందని తండ్రి కన్నీరుమున్నీరయ్యాడు.తండ్రి దానయ్య ఫిర్యాదు మేరకు ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గణేశ్ ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులు, ఆయనను ఎవరు వెంబడించారు? ఫోన్ చేసి బెదిరించిన వ్యక్తులు ఎవరనే కోణాల్లో విచారణ జరుపుతున్నారు

రైతు సంఘం జాతీయ మహాసభలకు విస్తృత ఏర్పాట్లు

• 15న 15 వేల మంది రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు

• రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ పిలుపు



టీ మీడియా, అక్టోబర్ 21 ,ఖమ్మం:తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పురిటిగడ్డ అయిన ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను అత్యంత ఉద్యమ స్ఫూర్తి తో నిర్వహించబోతున్నామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ వెల్లడించారు. నవంబర్ 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ చారిత్రాత్మక మహాసభల వివరాలను ఆయన బుధవారం ఖమ్మం లోని సుందరయ్య భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో ఖమ్మం జిల్లాలో 26వ మహాసభలు జరిగాయని, సరిగ్గా 37 సంవత్సరాల తర్వాత మళ్లీ 1979లో ఖమ్మంలోనే జరిగాయని గుర్తుచేశారు. ఇప్పుడు 37 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత స్వతంత్ర తెలంగాణ గడ్డపై ఈ జాతీయ మహాసభలు జరగడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుందని ఆయన పేర్కొన్నారు . నవంబర్ 15న మహాసభల ప్రారంభం సందర్భంగా 15 వేల మంది క్రమశిక్షణ కలిగిన రెడ్‌షర్ట్ వాలంటీర్లతో భారీ ప్రదర్శన, కవాతు నిర్వహిస్తున్నామని, అలాగే లక్ష మందికి పైగా రైతులతో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలను జయప్రదం చేయడానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతాంగం, ప్రజానీకం పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహాసభల్లో పోరాట కార్యాచరణ

నల్లగొండలో జరగబోయే జాతీయ మహాసభల్లో భారత వ్యవసాయ రంగం, రైతాంగ భవిష్యత్తుపై లోతైన చర్చలు జరిపి, రైతులు, వ్యవసాయ కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలను మరింత బలోపేతం చేసే కార్యాచరణను రూపొందిస్తామని పోతినేని సుదర్శన్ వెల్లడించారు. ముఖ్యంగా వృద్ధాప్యంలోకి వచ్చిన పేద రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు జీవించడానికి ఎటువంటి ఆధారమూ లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకోవడానికి నెలకు రూ. 10,000 పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, రైతు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చట్టబద్ధమైన హామీతో కూడిన “కనీస మద్దతు ధరల చట్టం” తీసుకురావాలని స్పష్టం చేశారు. స్వతంత్రంగా, ఐక్యంగా నిర్వహించే భవిష్యత్ ఉద్యమాల ద్వారా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, దేశీయ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి ఈ 36వ జాతీయ మహాసభలు వేదిక కాబోతున్నాయని తెలిపారు.విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, బండి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబుతదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల సేవలు చిరస్మరణీయం





• జిల్లా కలెక్టర్ ., పోలీస్ కమిషనర్

టీ మీడియా, అక్టోబర్ 21, ఖమ్మం:ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాల ఫలితమే నేడు సమాజంలో కనిపిస్తున్న శాంతి, సౌభ్రాతృత్వమని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

స్మారక స్థూపం వద్ద ఘన నివాళులు

జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. తొలుత పోలీసు సాయుధ బలగాలు పరేడ్ నిర్వహించి గార్డ్ ఆఫ్ హానర్ సమర్పించాయి. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. గార్డ్ ఆఫ్ హానర్ పరేడ్‌కు ఆర్ఐ శ్రీశైలం ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

శాంతిభద్రతల పరిరక్షణలోకీలక పాత్ర

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, దేశ రక్షణలో సైన్యం, ప్రజల శ్రేయస్సు కోసం పోలీసు శాఖ ప్రదర్శిస్తున్న నిబద్ధత, అంకితభావం, త్యాగాలు సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పునాదిగా నిలుస్తున్నాయని అన్నారు. జిల్లా పరిపాలన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న సమయంలో ప్రజలకు రక్షణ, భద్రత, భరోసా కల్పిస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పోలీసు శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న పోలీసు సిబ్బందికి కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారం, వారు చేస్తున్న త్యాగాలను కూడా సమాజం గుర్తించాలని అన్నారు. పోలీసుల విధి నిర్వహణ వెనుక కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారం ఎంతో విలువైనవని తెలిపారు.

అమరవీరుల త్యాగాలు పోలీసులకు స్ఫూర్తి: సీపీ

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా బలగాల దాడిలో 10 మంది భారతీయ పోలీసులు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. వారి అసమాన త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణలో గతంలో తీవ్రవాదం కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ప్రజలు భయాందోళనల మధ్య జీవించాల్సిన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోలీసులు చేసిన కృషి, త్యాగాల ఫలితంగా నేడు రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం నెలకొందని పేర్కొన్నారు.

పోలీసు అధికారులు, అమరుల కుటుంబ సభ్యుల హాజరు

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏఆర్ డీసీపీలు కుమారస్వామి, విజయబాబు, ఏఆర్ ఏసీపీలు సుశీల్ సింగ్, నర్సయ్య, ఏసీపీలు రమణమూర్తి, మహేష్, సాంబరాజు, నర్సింహారావు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు హేమనాథ్, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం వెయ్యి క్యూసెక్కులు

–ఎల్లూరు జలాశయానికి మంత్రి జూపల్లి నీరు విడుదల

టి మీడియా, అక్టోబర్ 21, కొల్లాపూర్ : పాలమూరు–రంగారెడ్డి–నార్లాపూర్ నుంచి ఎల్లూరు జలాశయానికి మంత్రి జూపల్లి కృష్ణారావు నీరు విడుదల చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 ఏళ్లు కాలయాపన చేసి మతి లేకుండా మాట్లాడుతున్నారని, ఉమ్మడి మహాబుబ్ నగర్ జిల్లా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలకు నీటిని ముందుకు తీసుకెళ్లండంటూ బీఆర్ఎస్ నేతలకు జూపల్లి కృష్ణారావు సవాల్? విసిరారు.

లక్ష ఎకరాలకు అదనంగా నీటిని ఇస్తున్నాం

నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం ఎల్లూరు సమీపంలోని మిషన్ భగీరథ అదనంగా “ రా” వాటర్ పంపింగ్ సిస్టంను మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. మిషన్ భగీరథ, పీఆర్ఎల్ఐ, ఎంజీకెఎల్ఐ ప్రాజెక్టుల అధికారులతో సమీక్షలు నిర్వహించారు. పీఆర్ఎల్ఐ అంజనగిరి రిజర్వాయర్ నుంచి ఎల్లూరు సమీపంలోని ఎంజీకేఎల్ఐ ఎల్లూరు రిజర్వాయర్?కు నీటిని విడుదల చేశారు. 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఎంజీకెఎల్ఐ నుంచి లక్ష ఎకరాలకు అదనంగా నీటిని ఇస్తున్నామని, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట నియోజకవర్గాలకు తాగు, సాగునీటి ఇబ్బంది లేకుండా చేస్తున్నామని ఆయన అన్నారు.

వారి వల్లే రైతులకు నీటి కష్టాలు

నీటిని ముందుకు తీసుకెళ్లండి, 10 ఏళ్లు నిర్లక్ష్యంగా ఉండి ఇప్పుడు తెలివిలేని మాటలు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేతలపై మంత్రి జూపల్లి కృష్ణారావు విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వచ్చాక పనులు ప్రారంభించామని, ఇంకా మూడు నాలుగు నెలలో పనులు పూర్తి అవుతాయని ఆయన స్పష్టం చేశారు. లేనిపోని అబద్ధాలు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన కాలువ పనులు తమ ప్రభుత్వం వచ్చాకనే ప్రారంభించడం జరిగిందని ఆయన అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన ప్రజలకు రైతులకు నీటి కష్టాలు వచ్చాయని ఆరోపించారు.

నియోజకవర్గం సాధనకు కృషి

• అభివృద్ధికి సహకరిస్తా.. మంత్రి శ్రీనివాస్ హామీ



టీ మీడియా, అక్టోబర్ 21, అమరచింత:అమరచింత ప్రాంత అభివృద్ధితో పాటు, అమరచింతను నియోజకవర్గంగా ఏర్పాటు చేసేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని బీజేపీ పంజాబ్, హర్యానా రాష్ట్రాల సంఘటనా కార్యదర్శి మంత్రి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన మంత్రి శ్రీనివాస్‌ను అమరచింత డెవలప్‌మెంట్ ఫోరమ్ నాయకులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అమరచింత ప్రాంత అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, నియోజకవర్గ సాధన కోసం తన పరిధిలో సహకరించాలని కోరారు.అమరచింత మండల కేంద్రంలో నూతన జవహర్ నవోదయ విద్యాలయం, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కార్మిక ఆసుపత్రి, పోస్టాఫీస్‌కు సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఫోరమ్ నాయకుల విజ్ఞప్తులపై మంత్రి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. అమరచింతను నియోజకవర్గంగా ఏర్పాటు చేసే ప్రయత్నాలతో పాటు, ప్రాంత అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అమరచింత డెవలప్‌మెంట్ ఫోరమ్ నాయకులు నర్సింహులు గౌడ్, అజ్జపాగు రఘు, మరాఠి అశోక్, కొంగరి భాస్కర్, సత్యేందర్, రవికుమార్, బాలకృష్ణ, దామోదర్, మున్సిపల్ కౌన్సిలర్ మాధవి రాజేందర్, కోఆప్షన్ సభ్యుడు అజయ్, చేనేత సొసైటీ అధ్యక్షుడు తిరుమల రఘు, రఘు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

• -69.53 లీటర్ల మద్యం, నాటుసారా స్వాధీనం

టీ మీడియా ,అక్టోబర్ 21 ,చింతూరు:స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం అక్రమ రవాణా, నిల్వ, పంపిణీ జరగకుండా చింతూరు సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఉదయ పావని తెలిపారు. పోలవరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా అక్రమ మద్యం నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

16 కేసులు.. రూ.33,657 విలువైన మద్యం స్వాధీనం

అక్టోబర్ నెలలో చింతూరు సబ్ డివిజన్ పరిధిలోని ఎటపాక, వీఆర్ పురం, కూనవరం, చింతూరు, మోతుగూడెం పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో ఏపీ ఎక్సైజ్ చట్టం కింద 15 కేసులు నమోదు చేసినట్లు ఎస్‌డీపీవో వెల్లడించారు. ఈ కేసుల్లో 59.53 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకోగా, దాని విలువ సుమారు రూ.29,657గా ఉందని తెలిపారు.అదేవిధంగా ఎటపాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఏపీ ప్రొహిబిషన్ చట్టం కింద మరో కేసు నమోదు చేసి, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీని విలువ సుమారు రూ.4,000గా అంచనా వేశారు.మొత్తంగా 16 కేసుల్లో 69.53 లీటర్ల మద్యం, నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ సుమారు రూ.33,657 ఉంటుందని ఉదయ పావని వివరించారు. స్వాధీనం చేసుకున్న మద్యంలో కింగ్‌ఫిషర్ బీర్, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ, ఆఫీసర్స్ ఛాయిస్ విస్కీ, బిన్నీస్ సూపర్ ఫైన్ విస్కీ, మాన్షన్ హౌస్ బ్రాందీ తదితర బ్రాండ్లకు చెందిన సీసాలు ఉన్నట్లు తెలిపారు.



అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ఎన్నికల సమయంలో ఓటర్లకు మద్యం పంపిణీ చేయడం చట్టరీత్యా నేరమని ఎస్‌డీపీవో హెచ్చరించారు. అక్రమ మద్యం రవాణా, నిల్వ, విక్రయాలు, నాటుసారా తయారీ లేదా పంపిణీలో పాల్గొనే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అక్రమ మద్యం లేదా నాటుసారాకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.పోలవరం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు సబ్ డివిజన్ పరిధిలో చెక్‌పోస్టులు, వాహన తనిఖీలు, పోలీసు నిఘాను మరింత కట్టుదిట్టం చేస్తామని ఎస్‌డీపీవో ఉదయ పావని వెల్లడించారు.

నిద్రిస్తున్నదంపతులపైదాడి


• భార్య పరిస్థితి విషమం



టీ మీడియా, అక్టోబర్ 21, దేవరకద్ర: భూ తగాదాలు ఓ కుటుంబంపై దాడికి దారితీశాయి. పొలం విషయంలో కొంతకాలంగా కొనసాగుతున్న వివాదం నేపథ్యంలో నిద్రిస్తున్న భార్యాభర్తలపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం జీనుగారాల గ్రామంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో భార్య తీవ్రంగా గాయపడగా, భర్తకు స్వల్ప గాయాలయ్యాయి.దేవరకద్ర ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జీనుగారాల గ్రామానికి చెందిన గరిగంటి మన్నెమ్మ, ఆమె భర్త భాస్కర్‌కు వారి దాయాది బాలరాజుతో కొంతకాలంగా పొలం విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో దంపతులిద్దరూ ఇంట్లో నిద్రిస్తుండగా బాలరాజు వారి ఇంట్లోకి ప్రవేశించి మన్నెమ్మపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె నోరు, చెంపలపై తీవ్ర గాయాలయ్యాయి.భార్య కేకలు విని నిద్రలేచిన భర్త భాస్కర్.. బాలరాజును అడ్డుకునేందుకు ప్రయత్నించగా, అతనిపైనా గొడ్డలితో దాడి చేశాడు. అదే సమయంలో దుర్గామాత ఉత్సవాలను చూసి అటువైపు వెళ్తున్న గ్రామానికి చెందిన అంజన్న అక్కడికి రావడంతో బాలరాజు అక్కడి నుంచి పరారయ్యాడు.తీవ్రంగా గాయపడిన మన్నెమ్మను చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. బాధితురాలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపారు.

పోరుకు సిద్ధమైన దేవరగట్టు
హింసను నివారించేందుకు పోలీసుల బందోబస్తు


టీ మీడియా, అక్టోబర్ 21, కర్నూలు : బన్ని ఉత్సవం అదో సంప్రదాయ వేడుక. ఆ ఉత్సవంలో హింస చెలరేగి ఎంతోమంది గాయాలపాలవుతారు. అయినా ఆచారంగా వస్తున్న వేడుకని అక్కడి ప్రజలు ఆపరు. ఈ ఏడాది కర్రల సమరానికి కర్నూలు జిల్లా దేవరగట్టు సిద్ధమైంది. ఈ సంవత్సరమైనా హింసకు తావు లేకుండా బన్ని ఉత్సవాన్ని నిర్వహించాలని పోలీసు అధికారులు పట్టుదలగా ఉన్నారు. పది గ్రామాల ప్రజలు కర్రలతో తలబడనున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు.కర్నూలు జిల్లా హోళగుంద మండలం దేవరగట్టులో ప్రతి దసరా పండగ రోజూ అర్ధరాత్రి కర్రల సమరం జరుగుతుంది. తరతరాలుగా ఈ ఆచారాన్ని స్థానికులు కొనసాగిస్తున్నారు. దేవరగట్టు వద్ద కొండపై వెలిసిన మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో దేవతామూర్తులైన మాళమ్మ, మల్లేశ్వరస్వామికి దసరా పండుగ రోజున అర్ధరాత్రి 12 గంటలకు ఏటా కల్యాణం జరిగేది. కానీ ఈసారి దసరా పండగ మరుసటి రోజు అర్ధరాత్రి కర్రలసమరం, స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్నారు.కల్యాణం అనంతరం కొండ పరిసరాల్లో ఉన్న పాదాలగట్టు, రక్షపడ, శమీవృక్షం ఎదురుగా ఉన్న బసవన్నగుడి ప్రాంతాల్లో దివిటీల వెలుతురులో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారు. ఆ విగ్రహాలను దక్కించుకోవడం కోసం నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల ప్రజలు ఒక జట్టుగా ఏర్పడతారు. ఆలూరు, సుళువాయి, ఎల్లార్తి, నిట్రవటి, అరికెర, బిలేహాల్ గ్రామస్థులు మరో జట్టుగా ఏర్పడి కర్రలతో తలపడతారు. దీనినే బన్ని ఉత్సవంగానూ పిలుచుకుంటారు. ఈ సమరంలో పదుల సంఖ్యలో గాయపడతారు. మరణాలూ నమోదైన చరిత్ర ఉంది.పటిష్టమైన బందోబస్తు : ప్రస్తుతం స్థానిక ఎన్నికల నేపథ్యంలో దేవరగట్టులో



కర్రల సమరం నిర్వహించడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. స్థానికంగా పార్టీల మధ్య ఉన్న మనస్పర్థలను సంప్రదాయబద్ధంగా నిర్వహించే కర్రల సమరం ఎటువైపు దారితీస్తుందోననే ఆందోళన అక్కడి గ్రామస్తుల్లో నెలకొంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటీవలే జిల్లా కలెక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ దేవరగట్టు ఉత్సవం జరిగే గ్రామస్థులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం దేవరగట్టు ప్రాంతాన్ని పరిశీలించారు. దేవరగట్టు కర్రల సమరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వెయ్యి మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. దేవుని ముందు నాట్యం, విన్యాసాలు చేసే సంప్రదాయంలో కొందరు వ్యక్తులు మనస్పర్థలు, పాతకక్షల కారణంగా కర్రలతో దాడులకు పాల్పడి గాయాల పాలవుతున్నారని ఎస్పీ తెలిపారు. ఉత్సవం ముసుగులో ఇతరుల తలలకు గాయాలు చేయడం, హింసకు పాల్పడటం వంటివి చేయవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

దేవరగట్టు పరిసర గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించిన 40 కార్డన్ సెర్చ్ ఆపరేషన్లలో భాగంగా సుమారు 300 కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు. దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో 5 చెక్‌పోస్టులు, 10 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్సవ ప్రాంతంలో 110 నైట్ విజన్ సీసీ కెమెరాలు, 700 ఎల్ఈడీ లైట్లు, 10 డ్రోన్ కెమెరాలతో పాటు కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ప్రారంభానికి నోచుకోని కమ్యూనిటీ హాల్



టీ మీడియా, అక్టోబర్ 21, తిరుమలాయపాలెం:ప్రజల అవసరాల కోసం నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా మారింది. ప్రజలకు ఉపయోగపడాల్సిన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో పాటు, పరిసరాల్లో పిచ్చిమొక్కలు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ప్రజాధనంతో నిర్మించిన భవనం ప్రజలకు ఉపయోగపడకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.బీసీ వర్గాల ప్రజలకు సమావేశాలు, ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడాల్సిన కమ్యూనిటీ హాల్ నిరుపయోగంగా ఉండటం పట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి, పరిసరాలను శుభ్రపరిచి ప్రజల వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.సంబంధిత ప్రజాప్రతినిధులు, గ్రామ పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకొని కమ్యూనిటీ హాల్ సమస్యపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చి, బీసీ వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బంగారం, విదేశీ కరెన్సీ పట్టివేత :5.84 కోట్లు సీజ్



• విజయవాడలో డీఆర్ఐ తనిఖీలు

టీ మీడియా, అక్టోబర్ 21, విజయవాడ : విజయవాడలో భారీ స్థాయి బంగారం, విదేశీ కరెన్సీ స్మగ్లింగ్ గుట్టురట్టయింది. పక్కా సమాచారంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు జరిపిన తనిఖీల్లో విదేశీ కరెన్సీ, అక్రమ బంగారం భారీగా పట్టుబడింది. బంగ్లాదేశ్ నుంచి కోల్‌కతా మీదుగా హైదరాబాద్‌కు ఈ స్మగ్లింగ్ దందా సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. పట్టుబడిన బంగారం, కరెన్సీ మొత్తం విలువ ఏకంగా రూ.5.84 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా స్మగ్లింగ్ ముఠాకు చెందిన ఇద్దరు వేర్వేరు బృందాలను అధికారులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు.విజయవాడ శివార్లలో అధికారులు ముందుగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక స్కార్పియో వాహనాన్ని అడ్డుకుని ముమ్మరంగా తనిఖీ చేశారు. ఆ వాహనంలో ఎవరికీ అనుమానం రాకుండా చాకచక్యంగా ఏర్పాటు చేసిన ఓ రహస్య అరను అధికారులు గుర్తించారు. ఆ అరను తెరిచి చూడగా భారీగా విదేశీ కరెన్సీ బయటపడింది. అందులో 60 వేల అమెరికన్ డాలర్లు, 21,500 యూరోలను గుర్తించిన అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

నడుముకు కట్టుకుని బంగారం తరలింపు

విదేశీ కరెన్సీ పట్టివేత ఒకవైపు ఉండగానే, ఇదే స్మగ్లింగ్ ముఠాకు చెందిన మరో ముగ్గురు క్యారియర్లను సైతం డీఆర్ఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ వైపు బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచి వారిని తనిఖీ చేశారు. వారి నడుముకు ప్రత్యేకంగా కట్టుకున్న పౌచ్‌లలో బంగారాన్ని దాచి తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ ముగ్గురు క్యారియర్ల నుంచి మొత్తం 3.147 కిలోల బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు.

ముఠా గుట్టు లాగుతున్న అధికారులు

ఈ వ్యవహారంలో స్కార్పియో వాహనంలో కరెన్సీ తరలిస్తున్న వారితో పాటు, బస్సులో బంగారంతో ప్రయాణిస్తున్న క్యారియర్లు కలిపి మొత్తం ఐదుగురిని అధికారులు అరెస్టు చేశారు. అంతర్జాతీయ స్థాయి స్మగ్లింగ్ ముఠాతో వీరికి ఉన్న సంబంధాలపై అధికారులు కూపీ లాగుతున్నారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న ఈ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లో ప్రధాన సూత్రధారులు ఎవరు, హైదరాబాద్‌లో వీరికి సహకరిస్తున్నది ఎవరనే కోణంలో తదుపరి దర్యాప్తును ముమ్మరంగా కొనసాగిస్తున్నారు